స్వాగతం పలికేందుకు సిద్ధంగా గండ్ర జ్యోతి

హనుమకొండ చౌరస్తాలో రోడ్‌షోలో పాల్గొన్న నాయకులు

పోలీస్ హెడ్‌క్వార్టర్స్ వద్ద స్వాగతం పలుకుతున్న ప్రజలు

సంప్రదాయ వేషధారణలో నృత్యం చేస్తున్న గిరిజనులు

కళాకారుల నృత్యాలు

నగరం.. గులాబీ వనం

- కేసీఆర్ రోడ్‌షోకు భారీగా తరలివచ్చిన జనం
- కిక్కిరిసిన హనుమకొండ
- బోనాలు, హారతులతో మహిళల స్వాగతం

నయీంనగర్, ఏప్రిల్ 28 : బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు బస్సు యాత్రలో భాగంగా ఆదివారం భారీ రోడ్‌షో నిర్వహించారు. హనుమకొండలోని అంబేద్కర్ జంక్షన్ వద్ద ప్రజాప్రతినిధులు, మంగళ హారతులతో జడ్పీ చైర్మన్ గండ్ర జ్యోతితో పాటు పలువురు మహిళలు బోనాలతో ఘన స్వాగతం పలికారు. కేసీఆర్‌ను చూడడానికి జనాలు వివిధ ప్రాంతాల నుంచి తండోపతండాలుగా తరలివచ్చారు. డప్పు వాయిద్యాలు, పాటలతో అంబేద్కర్ జంక్షన్ మార్మోగింది. బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి సుధీర్ కుమార్ కేసీఆర్ ఆశీర్వాదం తీసుకున్నారు. కాగా, కేసీఆర్‌ను ఫొటో తీసేందుకు జనాలు పోటీలు పడ్డారు. అంబేద్కర్ జంక్షన్ నుంచి 7.57గంటలకు పోలీసు హెడ్‌క్వార్టర్స్ నుంచి హనుమకొండ చౌరస్తా వరకు రోడ్ షో నిర్వహించారు.

అంబేద్కర్ జంక్షన్‌కు ర్యాలీగా వస్తున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

మక్కజొన్న చేను దగ్ధం

దామెర, ఏప్రిల్ 28 : మండలంలోని కోగిల్వాయి శివారులో మక్కజొన్న పంట ప్రమాదవశాత్తు ఆదివారం దగ్ధమైంది. విషయం తెలుసుకున్న ఎస్సై కొంక అశోక్ అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించి వారి సహకారంతో 20గుంటల వరకు వ్యాపించిన మంటలను అదుపులోకి తీసుకువచ్చారు.

గన్ మిస్‌ఫైర్.. కానిస్టేబుల్‌కు గాయాలు

కాశీబుగ్గ, ఏప్రిల్ 28 : గన్ మిస్‌ఫైర్ కావడంతో వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ గోదాంలోని స్ట్రాంగ్ రూంల వద్ద ఆదివారం బందోబస్తులో ఉన్న రంగశాయిపేటకు చెందిన ఏఆర్ కానిస్టేబుల్ రాజేశ్(32) ఎడమ పాదానికి గాయాలయ్యాయి. వెంటనే అతడిని ఎంజీఎం దవాఖానకు తరలించారు. ఎలాంటి ప్రమాదం లేదని వైద్యులు తెలిపారు.

యువతి వివాహానికి ఆర్థిక సాయం

రాయపర్తి, ఏప్రిల్ 28: సన్నూరుకు చెందిన నిరుపేద మానసిక దివ్యాంగురాలి వివాహానికి పలువురు దాతలు ఆర్థిక సాయం అందజేశారు. గ్రామానికి చెందిన ఆరెల్లి పద్మ-బొంద్యాలు దంపతుల కూతురు మానసిక దివ్యాంగురాలైన ఉషకు వివాహం జరిగింది. ఈ మేరకు శ్రీలక్ష్మీగణపతి యువజన సంఘం సభ్యులు విరాళాలు సేకరించి రూ. 5500 నగదును ఆదివారం ఉష కుటుంబ సభ్యులకు అందజేశారు. మైలారం గ్రామానికి చెందిన ఎస్ఆర్ఆర్ ఇన్‌ఫ్రా అధినేత పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి తన అనుచరులతో ఉష కుటుంబ సభ్యులకు రూ. 10 వేల నగదు అందించారు.

న్యూశాయంపేట : సమ్మేళనంలో పాల్గొన్న పూర్వవిద్యార్థులు

పూర్వ విద్యార్థుల సమ్మేళనాలు

న్యూ శాయంపేట/హసన్‌పర్తి, ఏప్రిల్ 28 : బొల్లికుంట క్రాస్ రోడ్‌లోని వివేకానంద ఉన్నత పాఠశాల 1998-99 పదో తరగతి బ్యాచ్ విద్యార్థుల సమ్మేళనం నగరంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో జరిగింది. పూర్వ విద్యార్థులు 25 ఏండ్ల క్రితం నాటి తమ జ్ఞాపకాలను పంచుకున్నారు. అలాగే, హసన్‌పర్తిలోని మహాత్మాగాంధీ విద్యాలయంలో కూడా 1998-99 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు టీటీడీసీ సమావేశ మందిరంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు.

హసన్‌పర్తి : గురువులతో పూర్వ విద్యార్థులు

చెక్‌పోస్టును తనిఖీ చేస్తున్న ఎన్నికల వ్యయ పరిశీలకుడు ధీరజ్ సింగా

ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలి

పర్వతగిరి, ఏప్రిల్ 28: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని ఎన్నికల వ్యయ పరిశీలకుడు ధీరజ్ సింగా అన్నారు. ఆదివారం 107 వర్ధన్నపేట అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలోని చింతనెక్కొండ చెక్‌పోస్టును ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టాటిక్ సర్వే లెన్స్ టీం నిర్వహణ, రికార్డులను పరిశీలించారు. వాహన రాకపోకలను గమనించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. మద్యం, నగదు రవాణా కాకుండా పటిష్ట నిఘా పెట్టాలని సూచించారు. ఆయన వెంట సహాయ వ్యయ అధికారి నాగనారాయణ, స్టాటిక్ సర్వేలెన్స్ టీం సభ్యుడు ఎల్‌వో నయీం ఉన్నారు.

మద్యం పట్టివేత

ఐనవోలు, ఏప్రిల్ 28: ఎన్నికల కోడ్ నేపథ్యంలో పంథిని గ్రామంలో బెల్టు షాపుపై ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ ఎస్ జీవన్‌కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా పుల్లూరి మల్లికార్జున్ ఇంట్లో అక్రమంగా నిల్వ చేసిన రూ.20,567 విలువైన మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. దాడుల్లో ఏఎస్సై సదానందం, కానిస్టేబుల్ రాకేశ్ పాల్గొన్నారు.

ఘనంగా వాసవీమాత పారాయణం

గిర్మాజీపేట, ఏప్రిల్ 28 : వాసవీ మా ఇంటికి కార్యక్రమాన్ని ఆదివారం సాయంత్రం ఆర్ఎన్‌టీ రోడ్‌లోని పట్టణ ఆర్యవైశ్య భవనంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు, మాజీ మేయర్ గుండా ప్రకాశ్‌రావు దంపతులు వాసవీ మాత ఉత్సవ విగ్రహాన్ని నెలకొల్పి, వాసవీమాత పారాయణాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తొనుపునూరి వీరన్న, కార్యవర్గ సభ్యులు కొండూరు శివప్రసాద్, అంచూరు శ్రీనివాస్, భవానీప్రసాద్, పాపారావు, కల్వ నాగరాజు, చిట్టిమల్ల విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

'కాంగ్రెస్ హయాంలో బీసీల అభివృద్ధి శూన్యం'

కాశీబుగ్గ/వర్ధన్నపేట, ఏప్రిల్ 28 : జనాభా ప్రకారం అధికంగా ఉన్న బీసీలు కాంగ్రెస్ హయాంలోనే రాజకీయంగా, ఉద్యోగపరంగా, ఆర్థికంగా వెనుకబడ్డారని తెలంగాణ ఎన్‌బీపీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ తాండూరి శ్రీనివాస్ అన్నారు. దేశాయిపేట రోడ్డులోని కేఆర్ గార్డెన్స్‌లో ఆదివారం బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కందిమల్ల మహేశ్ అధ్యక్షతన వరంగల్ పార్లమెంట్ సామాజిక సమ్మేళనం నిర్వహించారు. బీసీలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్ పార్టీని భూస్థాపితం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి: అరూరి

రాజకీయంగా మాదిగలకు అవకాశం ఇవ్వకుండా మోసం చేసిన కాంగ్రెస్ పార్టీకి ప్రజలే తగిన బుద్ధి చెప్పాలని వరంగల్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి అరూరి రమేశ్ పిలుపునిచ్చారు. 14వ డివిజన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మాదిగలకు ఒక్క సీటు కూడా కేటాయించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కడియం శ్రీహరి ఎస్సీ రిజర్వేషన్ ఉపయోగించుకుంటూ జనాభా ప్రకారం అధికంగా ఉన్న మాదిగలను రాజకీయంగా అణగదొక్కుతున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ హయాంలోనే బడుగు బలహీన వర్గాలు అన్ని రంగాల్లో వెనుకబడ్డాయన్నారు. అలాగే, వర్ధన్నపేటలో దళితమోర్చా నియోజకవర్గస్థాయి సదస్సును రాష్ట్ర కన్వీనర్ కొండేటి శ్రీధర్ అధ్యక్షతన నిర్వహించగా అరూరి రమేశ్ పాల్గొని మాట్లాడారు. కడియం శ్రీహరికి దళితుల ఓట్లు అడిగే హక్కు లేదన్నారు.

కాంగ్రెస్ మోసపూరిత మాటలను నమ్మొద్దు

- బీఆర్ఎస్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలి
- నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

నర్సంపేటరూరల్, ఏప్రిల్ 28: కాంగ్రెస్ మోసపూరిత మాటలను ప్రజలు నమ్మొద్దని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి కోరారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని ముగ్ధంపురం, రాజపల్లి, గురిజాల, మహేశ్వరం, లక్నేపల్లి గ్రామాల్లో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశాల్లో ఆయన మాట్లాడారు. పదేళ్ల కేసీఆర్ పాలనలో రాష్ట్రం అభివృద్ధి చెందడంతోపాటు పేదలకు సంక్షేమ పథకాలు పక్కాగా అందాయన్నారు. నర్సంపేట అభివృద్ధికి తాను సంపూర్ణంగా నిధులు తీసుకొచ్చానన్నారు. ప్రస్తుత ఎమ్మెల్యేకు, సీఎం రేవంత్‌రెడ్డికి సత్సంబంధాలు లేవని స్పష్టమైందన్నారు. దీంతో నర్సంపేట అభివృద్ధి ప్రశ్నార్థకంగా మారిందన్నారు. కాంగ్రెస్ అనాలోచిత చర్యల వల్ల రాష్ట్రంలో కరువు ఏర్పడిందని, సరిపడా గోదావరి జలాలు ఉన్నా ప్రభుత్వానికి ఒడిసిపట్టే తెలివి లేదని ఎద్దేవా చేశారు. దీంతో పంటలన్నీ ఎండిపోయి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వడ్లకు క్వింటాల్‌కు రూ.500 చొప్పున బోనస్ ఇస్తామని చెప్పిన కాంగ్రెస్.. పట్టించుకోవడం లేదని విమర్శించారు. 420 హామీలు ఇచ్చి తెలంగాణ ప్రజలను మోసం చేసిన హస్తం పార్టీకి వచ్చే ఎన్నికల్లో ఓటుతో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. వ్యవసాయ రైతు కూలీలకు సంవత్సరానికి రూ.15 వేలు, ఉపాధిహామీ కూలీలకు రూ.12 వేలు ఇస్తామని చెప్పి కాంగ్రెస్ ప్రజలను మోసం చేసిందన్నారు. సమావేశాల్లో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నామాల సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి ఈర్ల నర్సింహరాములు, ఎంపీపీ మోతె కళావతి, జడ్పీటీసీ కోమాండ్ల జయ, సర్పంచ్‌ల ఫోరం మాజీ మండల అధ్యక్షుడు కొడారి రవన్న, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు భూక్యా వీరన్న, క్లస్టర్ బాధ్యులు ఈర్ల నర్సింహరాములు, మోతె పద్మనాభరెడ్డి, కోమాండ్ల గోపాల్‌రెడ్డి, మోతె జయపాల్‌రెడ్డి, కడారి కుమారస్వామి, తాళ్లపెల్లి రాంప్రసాద్, మచ్చిక నర్సయ్యగౌడ్, మాజీ సర్పంచ్‌లు పెండ్యాల జ్యోతి-ప్రభాకర్, నామాల భాగ్యమ్మ, మమత, వల్గుబెల్లి రంగారెడ్డి, ఎంపీటీసీ విజయ పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలి

ఖానాపురం, ఏప్రిల్ 28: రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలని పద్మావతి రైతు ఉత్పత్తిదారుల సంఘం ఇన్‌చార్జీలు గిరిగాని నర్సయ్య, చెడుపాక ఉపేందర్ అన్నారు. బుధరావుపేటలో పద్మావతి రైతు ఉత్పత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆదివారం ప్రారంభించారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు. కార్యక్రమంలో నర్సయ్య వెంకన్న, పాషా, వెంకటప్రసాదరావు, రాంనర్సింహారెడ్డి, ఎంపీటీసీ పూల్‌సింగ్, లింగిడి వెంకన్న పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఉపేందర్

తాగునీటి సరఫరాలో ఇబ్బందులు లేకుండా చూడాలి

గ్రేటర్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

తాగునీటి సరఫరాను పరిశీలిస్తున్న కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

వరంగల్, ఏప్రిల్ 28 : తాగునీటి సరఫరాలో ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని గ్రేటర్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అధికారులను ఆదేశించారు. ఆదివారం రాంపూర్, భట్టుపల్లి నుంచి ధర్మసాగర్ వరకు పైప్ లైన్, ఫ్లో మీటర్లు, ఎయిర్ వాల్స్‌ను పరిశీలించి మరమ్మతులు చేయాలని సూచించారు. వేసవి నేపథ్యంలో గ్రేటర్ వ్యాప్తంగా అన్ని డివిజన్లలో నీటి సరఫరాలో అంతరాయం కలుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో బల్దియా ఎస్ఈ ప్రవీణ్‌చంద్ర, ఈఈ రాజయ్య, పబ్లిక్ హెల్త్ ఈఈ రాజ్‌కుమార్, డీఈ సంతోష్‌బాబు పాల్గొన్నారు.

బల్దియా గ్రీవెన్స్ రద్దు

గ్రేటర్ కార్పొరేషన్‌లో సోమవారం నిర్వహించే గ్రీవెన్స్‌ను రద్దు చేసినట్లు గ్రేటర్ కమిషనర్ ఒక ప్రకటనలో తెలిపారు. లోకసభ ఎన్నికల విధుల్లో అధికారులు, సిబ్బంది నిమగ్నమై ఉన్నందున గ్రీవెన్స్‌ను రద్దు చేస్తున్నామన్నారు. ప్రజలు ఫిర్యాదులు ఇచ్చేందుకు బల్దియా కార్యాలయానికి రావొద్దని కోరారు.

నేడు ప్రజావాణి రద్దు

ఖిలావరంగల్, ఏప్రిల్ 28: వరంగల్ కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించనున్న ప్రజావాణిని రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ ప్రావీణ్య ఒక ప్రకటనలో తెలిపారు. అధికారులు, సిబ్బంది పార్లమెంట్ ఎన్నికల విధుల్లో నిమగ్నమై ఉన్నందున ఈ నిర్ణయం తీసుకున్నామని, జిల్లా ప్రజలు ఫిర్యాదుల కోసం కలెక్టరేట్‌కు రావొద్దని కోరారు.

సదస్సులో పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కవులు

సెక్యులరిజం పరిరక్షణకు ముందుండాలి

సాహిత్య అకాడమీ పూర్వ చైర్మన్ డాక్టర్ నందిని సిధారెడ్డి

కేయూలో 'లౌకిక విలువలు -సాహిత్యం'పై సదస్సు

హనుమకొండ చౌరస్తా, ఏప్రిల్ 28 : సెక్యులరిజం పరిరక్షణ కోసం కవులు, రచయితలు కృషి చేయాల్సిన అవసరం ఉందని సాహిత్య అకాడమీ పూర్వ చైర్మన్ డాక్టర్ నందిని సిధారెడ్డి అన్నారు. ఆదివారం కేయూలో 'సమూహ' సెక్యులర్ రైటర్స్ ఫోరం ఆధ్వర్యంలో లౌకిక విలువలు- సాహిత్యం అనే అంశంపై సభ జరిగింది. సీనియర్ కవి యాకూబ్ అధ్యక్షత వహించగా నందిని సిధారెడ్డి ప్రారంభోపన్యాసం చేశారు. మతం ప్రాతిపదికన రాజ్యం నడవొద్దని, పాలనలో మతం జోక్యం ఉండొద్దని ప్రముఖ సాహితీ విమర్శకుడు గుంటూరు లక్ష్మీనరసయ్య అభిప్రాయపడ్డారు. 'సాహిత్య రాముడు- రాజకీయ రాముడు' అనే అంశంపై రిటైర్డ్ ప్రొఫెసర్ కాత్యాయనీ విద్మహే మాట్లాడుతూ రామరాజ్యంలో సంక్షేమం ఉందా అని ప్రశ్నించారు. ఇండియాలో ఫాసిజం అంటే మనువాదమేనని సాహితీ విమర్శకుడు జిలుకర శ్రీనివాస్ వెల్లడించారు. ముగింపు సమావేశంలో ఖాదర్ మొహినుద్దీన్ ప్రసంగించారు. అనంతరం 8 తీర్మానాలను సదస్సు ఆమోదించింది. ఆహ్వాన సంఘం అధ్యక్షుడు లోచన్, కేయూ రిజిస్ట్రార్ మల్లారెడ్డి, రచయితలు, కవులు అంపశయ్య నవీన్, అనిశెట్టి రజిత, రూపా రుక్మిణి, పసునూరి రవీందర్, గంటా రామిరెడ్డి, ఏకే ప్రభాకర్, గుమ్మడి అనురాధ, మెర్సీ మార్గరెట్, నాళేశ్వరం శంకరం, పసునూరి రవీందర్, రాఘవాచారి, కోడం కుమారస్వామి, స్కైబాబా పాల్గొన్నారు.

ఒప్పందం చేసుకుంటున్న నిట్ డైరెక్టర్ బిద్యాదర్ సుబుధి

'ఎల్ అండ్ టీ'తో నిట్ ఒప్పందం

హనుమకొండ చౌరస్తా, ఏప్రిల్ 28 : నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అకాడెమియా, రీసెర్చ్ యాక్టివిటీస్‌లో సహకారం కోసం గుజరాత్‌లోని ఎల్అండ్‌టీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్‌తో అవగాహన ఒప్పందం కుదిరింది. నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధి, డీన్, ఎల్అండ్‌టీ ఐపీఎం ప్రొఫెసర్ రాజీవ్ నెహ్రూ ఎంవోయూపై సంతకం చేశారు. ప్రొఫెసర్లు రతీశ్‌కుమార్, టీడీ గుణేశ్వర్ రావు, రమాదేవి, అనిత పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

LOST DOCUMENT

★I, KUMMARI SANDEEP KUMAR, S/o. K.SAMPATH, H.No. 1-1-1191, Siddhartha Nagar, Babu Camp, Kazipet Mdl., Hanumakonda Dist., My Original Link Document No. 5363/2012 has been lost while Shifting from Fathima Nagar to Venkatadri Nagar, If found please cont. 9000075833.
NTW-00

WANTED

★Wanted boys for car & bike wash for a reputed company. Contact Cell No. 7901691665.
NTW-00

★హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్ 6K. Ph: 9640258899, 9640468899
NT-311840

సెప్టిక్ ట్యాంక్ క్లీనర్

SepTeK

★ సెప్టిక్ ట్యాంక్ క్లీనర్ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్ఫర్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును. డి.ఎస్. రావు. Cont: 9849145043.
NTW-323227

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే
ప్రకటనల విభాగం : 9182777552

HANAMKONDA	WARANAGAL
9182777563	9182777556
9182777618	9182777557

JAYASHANKAR BHUPALPALLY - 9182777559
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777554
JANGAON - 9182777565

రాయపర్తి: గణేశ్‌కుంట నుంచి బయల్దేరుతున్న నాయకులు

కాశీబుగ్గ : హనుమకొండకు తరలుతున్న నాయకులు

ఐనవోలు : బయల్దేరుతున్న పార్టీ నేతలు

కాజీపేట : బాపూజీనగర్ నుంచి బస్సు యాత్రకు తరలుతున్న బీఆర్ఎస్ శ్రేణులు

దామెర : ముస్త్యాలపల్లి నుంచి రోడ్ షోకు తరలివెళ్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

గీసుగొండ : కేసీఆర్ రోడ్ షోకు వెళ్తున్న విశ్వనాథపురం బీఆర్ఎస్ శ్రేణులు

రోడ్‌షోకు తరలిన గులాబీ శ్రేణులు

రాయపర్తి/కాశీబుగ్గ/ఐనవోలు/ కాజీపేట/దామెర/గీసుగొండ, ఏప్రిల్ 28: బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చేపట్టిన బస్సుయాత్ర, రోడ్‌షోలో పాల్గొనేందుకు ఆదివారం రాయపర్తి మండలంలోని అన్ని గ్రామాల నుంచి పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. 39 గ్రామాల నుంచి భారీగా నాయకులు, ప్రజాప్రతినిధులు, యువకులు వెళ్లారు. అలాగే, హనుమకొండలో జరిగిన కేసీఆర్ బస్‌యాత్ర, రోడ్‌షోకు వరంగల్ 14, 3వ డివిజన్ల నుంచి బీఆర్ఎస్ కార్యకర్తలు పెద్ద ఎత్తున బయల్దేరి వెళ్లారు. 14వ డివిజన్‌లో కేతిరి రాజశేఖర్ ఆధ్వర్యంలో ఎస్ఆర్‌నగర్, బాలాజీనగర్, సుందరయ్యనగర్, ఎనుమాముల నుంచి భారీగా తరలారు. కార్యక్రమంలో గంధం గోవిందు, పత్రి రాజపోషాలు, తూర్పాటి సంపత్, గండ్రాతి భాస్కర్ పాల్గొన్నారు. ఐనవోలు మండలంలోని వివిధ గ్రామాల నుంచి పార్టీ శ్రేణులు బయల్దేరి వెళ్లారు. హనుమకొండ జిల్లాకేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి పార్టీ మండల అధ్యక్షుడు తాటికాయల కుమార్, ప్రధాన కార్యదర్శి కాటబోయిన అశోక్ జెండా ఊపి వాహనాలను ప్రారంభించారు. ఎస్సీ సెల్ నాయకుడు రాజు, సీనియర్ నాయకుడు లక్ష్మణ్ పాల్గొన్నారు. కేసీఆర్ చేపట్టిన రోడ్డు షోకు కాజీపేట బీఆర్ఎస్ శ్రేణులు భారీగా తరలి వెళ్లాయి. డివిజన్ల అధ్యక్షులు పాలడుగుల శివకుమార్, దువ్వ కనుకరాజు, బెదరికొండ రంజిత్, కోటి, హరినాథ్ ఆధ్వర్యంలో తరలిన ర్యాలీకి నార్ల గిరి రమేశ్, మర్యాల కృష్ణ, గబ్బెట శ్రీనివాస్, కార్పొరేటర్ సంకు నర్సింగరావు జెండా ఊపారు. దామెర మండలంలోని ల్యాదెళ్లలో ఎంపీపీ కాగితాల శంకర్, ఊరుగొండలో వైస్ ఎంపీపీ జాకీర్‌అలీ, దుర్గంపేటలో మండలాధ్యక్షుడు గండు రామకృష్ణ, ముస్త్యాలపల్లిలో గ్రామ అధ్యక్షుడు చిలువేరు రాజు, దామెరలో ఎంపీటీసీ పోలం కృపాకర్‌రెడ్డి, కోగిల్వాయిలో ఎంపీటీసీ సంగనబోయిన మౌనిక-కిరణ్, ఓగులాపురంలో శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో కార్యకర్తలు వెళ్లారు. గీసుగొండ మండలంతో పాటు గ్రేటర్ వరంగల్ గ్రామాల బీఆర్ఎస్ శ్రేణులు భారీ సంఖ్యలో తరలివెళ్లారు.

రేవంత్‌రెడ్డివి దొంగ హామీలు

హనుమకొండ చౌరస్తా : గద్దెనెక్కడం కోసం రేవంత్‌రెడ్డి దొంగ హామీలు ఇచ్చిండు. ఒక్కటి కూడా చేస్తలేడు. ఫ్రీ బస్సుతో మాకు ఉపాధి పోయింది. బతుకు భారమైంది. ఎవరూ ఆటోలు ఎక్కడం లేదు. గిరాకీ వస్తలేదు. కుటుంబాన్ని పోషించుకోలేకపోతున్నా. ఆటోడ్రైవర్ల పొట్టకొట్టిండు. మా ఉసురు రేవంత్‌రెడ్డికి తాకుతుంది. కేసీఆర్ పదేళ్ల పాలనలో తెలంగాణను ఎంతో బాగు చేసిండు.

– మదరబోయిన రాజు, కటాక్షపూర్, ఆటోడ్రైవర్

కాంగ్రెస్ అబద్ధాలతో అధికారంలోకి..

కాంగ్రెస్ అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చింది. రైతులకు రూ.2లక్షల రుణ మాఫీ చేస్తలేరు. రూ.4 వేల పింఛన్ రాలేదు. కేసీఆర్ ఇచ్చే కల్యాణలక్ష్మి, షాదీముబారక్‌తో పాటు అదనంగా తులం బంగారం ఇస్తానన్నారు.. ఏ ఒక్కటి చేస్తలేరు. ఇప్పుడు ఎన్నికలు రాగానే అన్ని చేస్తానని మళ్లీ మోసం చేసేందుకు రెడీ అయ్యారు. ప్రజలు రేవంత్‌రెడ్డి మాటలు నమ్మి మళ్లీ మోసపోరు. ఇప్పటికే ఎందుకు ఓట్లు వేసినమని బాధపడుతున్నాం.

– కంజర్ల జ్ఞానసాగర్, హనుమకొండ

కేసీఆరే మళ్లీ ముఖ్యమంత్రి కావాలి..

కేసీఆర్ కారు గుర్తుకు ఓటు వేయకుండా పెద్ద తప్పు చేసినం. ఇప్పుడు మాకు తెలుస్తాంది. ఎంతో బాధపడ్తానం. కేసీఆరే మళ్లీ సీఎం కావాలి. దొంగ హామీలు ఇచ్చిన రేవంత్‌రెడ్డి మాకు అవసరం లేదు. బస్సు ఫ్రీ చేస్తే సీట్ల కోసం అందరూ కొట్లాడుతుండ్రు. పొలాలకు నీళ్లులేవు. కరెంట్ సక్కగ ఉంటలేదు. ఊకే వస్తాంది.. పోతాంది.

– తిరుపతి రాధమ్మ, నందనం

కాలు విరిగినా కేసీఆర్ కోసం..

నేను మేస్త్రీ పనిచేస్తాను. నా కాలు విరిగింది. కేసీఆర్‌ను చూసేందుకు హనుమకొండ చౌరస్తాకు వచ్చాను. దేశంలోనే కేసీఆర్ తెలంగాణను అగ్రభాగాన నిలిపిండు. దేశంలోనే ఎక్కడా లేనివిధంగా అనేక పథకాలు ఇచ్చిండు. అందరికీ ఎంతో మేలు చేసిండు. 10 సంవత్సరాలు ప్రజలు సంతోషంగా ఉండె. ఇప్పుడు కాంగ్రెస్ వచ్చిన తర్వాత అందరూ ఇబ్బందులు పడుతున్నారు. రైతులు, ప్రజలకు కష్టాలు తప్పలేదు.

– ఎన్ బాబురావు, ఎన్జీవోస్ కాలనీ